క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అన్వేష్‌కుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: విజయవాడలో జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్రస్థాయి యువజన విభాగం సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ కడివేటి అన్వేష్‌కుమార్‌రెడ్డి కలిశారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని ఆయన తెలిపారు.

ప్రసన్న పరామర్శ



జక్కా కామేశ్వరమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీస్తున్న ప్రసన్న

ఇందుకూరుపేట: మాజీ ఎమ్మెల్యే జేకే రెడ్డి మాతృమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్ర రెడ్డి అమ్మమ్మ జక్కా కామేశ్వరమ్మను జగదేవిపేటలోని వారి నివాసంలో మాజీ మంత్రి, పార్టీ అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, పార్టీ నాయకులు బాలశంకర్ రెడ్డి, రూప్‌కుమార్‌రెడ్డి, షబ్బీర్ ఉన్నారు.

కామాక్షితాయి సేవలో..



న్యాయమూర్తి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయిని జిల్లా ప్రిన్సిపల్ ప్రత్యేక న్యాయమూర్తి జి.శ్రీనివాస్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ వెంకట శ్రీనివాసులురెడ్డి న్యాయమూర్తి దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైపాడు బీచ్‌కు పోటెత్తిన పర్యాటకులు



ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు సాగరతీరం ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. నెల్లూరు నగరంలో రొట్టెల పండగకు విచ్చేసిన పలువురు భక్తులు అనంతరం మైపాడు తీరానికి చేరుకున్నారు. దీంతో ఇక్కడ పర్యాటకులతో కిటకిటలాడింది. దీంతో మైపాడు- నెల్లూరు ప్రధాన రహదారి వాహనాలతో రద్దీగా మారింది. ఎస్సై నాగార్జునరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుక్కలకు రేబిస్ టీకాలు



ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేట ఏడీ కార్యాలయంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో 32 కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేశారు. అనంతరం రేబిస్ వ్యాధి లక్షణాలు, నష్టాల గురించి వివరించారు.

మంత్రి దృష్టికి డీహెచ్‌ఈఓల సమస్యలు

నెల్లూరు(అర్బన్): డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల సుధాకర్‌రావు మంత్రి పొంగూరు నారాయణను కోరారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం పలువురు రాష్ట్ర నాయకులు మంత్రి నారాయణను ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలను వివరించారు. అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటరమణ, కోశాధికారి హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు అనూరాధ, సరోజిని, శివరామకృష్ణ, కృష్ణమోహన్, రమణ, ప్రసాద్, సయ్యద్ బేగం, కృష్ణశేఖర్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఏడాది పాలనపై సమస్యల ఏకరవు

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని చుట్టుముడుతున్న ప్రజలు
- ప్రజలకు సమాధానం చెప్పలేక తిరుగుముఖం
- అట్టర్‌ఫ్లాప్ దిశగా 'సుపరిపాలనలో తొలి అడుగు'



బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో వివిధ సమస్యలపై ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న ప్రజలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశాలతో నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం అభాసుపాలవుతోంది. ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని, అభివృద్ధి గురించి వివరించాలని టీడీపీ అధినేత ఆదేశించారు. అయితే ఈ కార్యక్రమంలో ముందుగా ఎంపిక చేసిన ఇళ్లకు వెళ్లి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. ముఖ్యంగా కోవూరు నియోజవర్గ వ్యాప్తంగా కూటమి పాలనపై ప్రజలు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ప్రశ్నలతో హడలెత్తిస్తున్నారు. సూపర్‌సిక్స్ హామీల అమలు, గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులపై ఆమె ఎక్కడికెళ్లినా ప్రజలు చుట్టుముట్టి సమస్యలు ఏకరవు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రజలకు ఏం సమాధానం చెప్పాలో అర్థంకాని పరిస్థితిలో 20 నుంచి 30 ఇళ్లు తిరిగి వెనుదిరుగుతున్నారు. దీంతో నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు అట్టర్‌ఫ్లాప్ దిశగా సాగుతోంది.

ఆయన చెబితేనే..!

బుచ్చిరెడ్డిపాళెంలో ఏ చిన్న సమస్య వచ్చినా ఎమ్మెల్యే కంటే ముందు ఇందుకూరుపేట మండలానికి చెందిన ఓ టీడీపీ ముఖ్య నేతకు చెప్పాలి. ఆయన ఆమోదం పొందితేనే సమస్య పరిష్కారమవుతుంది. ఈ నేపథ్యంలో బుచ్చి టీడీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు మరికొంతమంది సీనియర్ టీడీపీ నాయకులు ఆయన చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తోంది. తమ సొంత మండలం, పట్టణంలో చిన్న చిన్న ప్రజా సమస్యలు పరిష్కరించడంలో తమ పాత్ర లేకపోవడం ఏంటని లోలోపల రగిలిపోతున్నారు. నగర పంచాయతీలో కౌన్సిలర్లు, గ్రామాల్లో సర్పంచ్‌లు ఎవరైనా సరే ఆయన అనుమతి లేకుండా సమస్యలు పరిష్కరించేందుకు వీలులేకపోవడంతో టీడీపీ కార్యకర్తలు, నాయకులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. అసలు బుచ్చిరెడ్డిపాళెంలో ఆయన పెత్తనం ఏంటని ఆ పార్టీ నాయకులే కొందరు బహిరంగంగా వాపోతున్నారు.

అభివృద్ధి జాడేదీ?

సంక్షేమ పథకాల అమలు తీరు పక్కన పెడితే గ్రామాల్లో అభివృద్ధి పనులు అసలు జరగడం లేదు. ముఖ్యంగా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో డ్రైనేజీల్లో పూడిక కూడా తీయడం లేదు. ఓ కాలువ నిర్మాణం లేదు. ఓ సిమెంట్‌రోడ్డును కూడా వేయడం లేదు. కేవలం నెలనెలా పింఛన్లు ఇస్తున్నామని మాత్రమే ఎమ్మెల్యే చెప్పడం వెనుక అభివృద్ధి ఏమాత్రం జరిగిందో అర్థమవుతోంది.

హామీలపై ప్రశ్నిస్తున్న ప్రజలు

కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ప్రజలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. తల్లికి వందనం అందలేదని కొందరు.. పింఛన్ రావడం లేదని మరికొందరు నిలదీస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలే కాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన వివిధ హామీల గురించి అసలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నిండి 59 ఏళ్ల మధ్య ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఈ హామీ గురించి అసలు ప్రభుత్వం నోరుమెదపడంలేదు. ఇదే కాకుండా ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఉచిత సిలిండర్లు, 50 ఏళ్లకే పింఛన్, విద్యాదీవెన, వసతిదీవెన, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా ఇలా ఏ పథకాలు అమలు చేసిన పాపాన పోలేదని ప్రజలు అంటున్నారు. ఈ హామీల సంగతి ఇలా ఉంటే కొత్తగా పింఛన్లు ఇవ్వకుండా పాతవారికి ఇస్తున్న పింఛన్లు వివిధ కారణాలతో తొలగిస్తుండటం పింఛన్‌దారుల్లో ఆందోళన కలిగిస్తోంది. మరోపక్క వలంటీర్లు తమను విధుల్లోకి తీసుకోవాలని, రూ.10 వేలు వేతనం ఇస్తామన్న ఎన్నికల హామీ ఏమైందని ప్రశ్నిస్తున్నారు. చంద్రన్న బీమా పథకం కింద సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఇస్తామని నమ్మబలికారు. ఇవేవీ ప్రస్తుతం ఇవ్వడం లేదు. పెళ్లికానుక రూ.లక్ష, పెట్రోల్ ధరల తగ్గింపు తదితర హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం సరికాదని పలువురు అంటున్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన పూజిత, నాయకులు

- కాకాణి పూజిత

పొదలకూరు: బడుగు, బలహీనవర్గాల ప్రజలకు భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత అన్నారు. పట్టణంలోని నెల్లూరు మార్గంలో జగ్జీవన్‌రామ్ భవన్ వద్ద ఆయన వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ పాటుపడినట్టు తెలిపారు. ఆయన ఎవరి ఉన్నతి కోసం పాటుపడ్డారో కూటమి ప్రభుత్వం వారిని అడ్డుపెట్టుకుని కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతూ అక్రమ కేసులు పెట్టిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ మహనీయుడిని అందరూ ఆదర్శంగా తీసుకుని బడుగుల కోసం పాటుపడాల్సిందిగా సూచించారు. అనంతరం పూజిత తన తండ్రి గోవర్ధన్‌రెడ్డికి విద్యాబుద్ధులు నేర్పిన సిద్దయ్య మాస్టర్ సంవత్సరీకానికి హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన్‌గౌడ్, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, ఎస్‌కే అంజాద్, జి.శ్రీనివాసులు, వార్డు సభ్యులు హేమంత్, రాంప్రసాద్, ప్రసాద్, నాయకులు జి.వేణుగోపాల్‌రెడ్డి, కోటేశ్వరరావు, గంగిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పెంచలయ్య, మస్తాన్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు



ఇందుకూరుపేట: పల్లిపాడులో..

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం తొలి ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్నం లక్ష్మీనారాయణ - లక్ష్మి దంపతులు లక్ష తులసీ ఆకులతో అర్చన చేశారు. మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తన్నీరు సుబ్రహ్మణ్యం - నాగేంద్ర కుమారి దంపతులు భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు.

- పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో తొలి ఏకాదశి పూజలను నిర్వహించారు. గోపూజ, సమస్రనామార్చన జరిగింది.
- ఇందుకూరుపేట: తొలి ఏకాదశి పర్వదినాన్ని మండల వాసులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పల్లిపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



మనుబోలులో..

- మనుబోలు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయం (విష్ణాలయం)లో తొలి ఏకాదశి పూజలను ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు మాధవగిరి హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం సుప్రభాత సేవ నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు అనమాల ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కోవూరు: పట్టణంలోని జేబీఆర్ ప్రభుత్వ హైస్కూల్లో యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ప్రసాద్, ఎంఈఓ చెంచులక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జీవితంలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పి.బుజ్జయ్య మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జీవీ చలపతిశర్మ, నాగిరెడ్డి, ఖాజావలీ, భారతి, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, జయప్రకాష్, సుబ్బారావు, శేషయ్య, వెంకయ్య, రహమతుల్లా, శ్రీశైల, శ్రీనివాసులు, మల్లికార్జునరావు, సుబ్రహ్మణ్యం, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం



ముస్తాబైన పడుగుపాడులోని సమావేశ మందిరం

కోవూరు: పడుగుపాడులో సోమవారం జరిగే వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ సమావేశానికి సర్వం సిద్ధం చేశారు. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, రాష్ట్ర పీఏసీ సభ్యుడు పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేయనున్నారు. కాగా ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ కోవూరు మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నరసింహులురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి సంయుక్తంగా కోరారు.

జయప్రదం చేయండి

విడవలూరు: కోవూరులోని పడుగుపాడులో జరిగే వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

నిమ్మ ధరల పతనంపై ఆరా

సాక్షి ఎఫెక్ట్..

పొదలకూరు: నిమ్మ ధరలు పతనం కావడంపై సాక్షిలో ఈనెల 4వ తేదీన 'నిమ్మ రైతు కంట చెమ్మ' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్టేట్ హార్టికల్చర్ కమిషనర్ స్పందించి ఆరా తీశారు. జిల్లా ఉద్యాన శాఖ నుంచి వివరాలు పంపాల్సిందిగా ఆదేశించారు. అధికారులు కమిషనర్‌కు వివరాలు అందజేయనున్నట్లు తెలిసింది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గత నెల 26న వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి(45) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందించారు. వారు సదరు వ్యక్తిని జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీ బీఈఈయూ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ బహుజన ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (ఏపీ బీఈఈయూ) జిల్లా సర్కిల్ కమిటీ ఎన్నిక ఆదివారం దర్గామిట్టలో నిర్వహించారు. కన్వీనర్‌గా పి.లక్ష్మీప్రసన్న, కో-కన్వీనర్లుగా రాకేష్, పెంచలప్రసాద్, బుజ్జయ్య, నిరంజన్‌లను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ తేళ్ల అంజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పులి చంద్రశేఖర్ హాజరయ్యారు.

చికెన్ వ్యర్థాలతో తీవ్ర దుర్గంధం

- అన్నం కూడా తినలేకున్నామని మహిళల ఆవేదన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రేబాల పంచాయతీ నెహ్రూకాలనీ, ప్రగతి నగర్‌లో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూకాలనీలో స్థానిక మహిళలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ చికెన్ వ్యర్థాలు కాలనీ సమీపంలోని చేపల గుంతల్లో వేయడం వల్ల తీవ్ర దుర్గంధం వస్తోందని, దీనివల్ల అన్నం కూడా తినలేకున్నామని వాపోయారు. నిత్యం పదుల సంఖ్యలో చికెన్ వ్యర్థాల వాహనాలు తమ కాలనీవైపు నుంచి వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మరికొందరు తమకు తల్లికి వందనం నగదు పడలేదని, పింఛన్ రావడం లేదని, రేషన్‌కార్డులు లేవని ఆమెకు వివరించారు. దీంతో సచివాలయ సిబ్బందిని పిలిచి వారంరోజుల్లో కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

పోలీసులు ఏం చేస్తున్నారు?

మహిళలు చికెన్ వ్యర్థాల విషయమై ప్రశ్నించడంతో పక్కనే ఉన్న సీఐ శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్యే పిలిచి మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. చికెన్ వ్యర్థాలు ఇష్టారాజ్యంగా తరలిస్తుంటే నిఘా ఉంచాల్సిన అవసరం లేదా అని సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అడిగిన ప్రశ్నలకు మీరే సమాధానం చెప్పండి అని సీఐని ఆదేశించారు. దీనికి సీఐ బదులిస్తూ నిత్యం బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, చికెన్ వ్యర్థాల వాహనాలు తిరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పీర్ల గ్రామోత్సవం



తాజియా చేస్తున్న ముస్లింలు

మనుబోలు: మొహర్రం సందర్భంగా కాగితాలపూరు గ్రామంలో వారంరోజులపాటు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం హజ్రత్ ఇమాం, హజ్రత్ అబ్బాస్‌ల పీర్లను ముస్తాబుచేసి ప్రార్థనలు నిర్వహించారు. విషాద చిహ్నంగా దర్గాలను నలుపు రంగు కాగితాలతో అలంకరించారు. ముస్లింలు ఉపవాసాలు ఉండి శనివారం రాత్రి అగ్నిగుండం తొక్కారు. భారీ సంఖ్యలో దర్గా వద్ద చేసిన తాజియా (రెండు వేళ్ల మధ్య బ్లేడు ఉంచుకుని ఛాతిపై రక్తం వచ్చేలా కొట్టుకోవడం) చూపరులకు కంటతడి పెట్టించింది. అనంతరం పీర్లతో గ్రామోత్సవం నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

కసుమూరులో భక్తుల కోలాహలం



దర్గాలో భక్తులు



దర్శనం కోసం క్యూలైన్‌లో వెళ్తూ..

వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన వెంకటాచలం మండలం కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గా ప్రాంగణం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. నెల్లూరులో బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగకు హాజరైన వారు కసుమూరుకు చేరుకోవడంతో మస్తాన్‌వలీ దర్గా వద్ద సందడి మొదలైంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి అనేకమంది విచ్చేశారు. తాగునీరు తదితర వాటికి సంబంధించి స్థానిక అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్య సమస్య కారణంగా తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. నెల్లూరులో రొట్టెల పండగ ముగిసేవరకు కసుమూరు దర్గా వద్ద భక్తుల రద్దీ కొనసాగుతుంది.

సందడే సందడి



గుర్తుగా సెల్ఫీ

నెల్లూరులో రొట్టెల పండగ సందడి నెలకొంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. బారాషహీద్‌లను దర్శించుకునేందుకు క్యూ కట్టారు. ఇది రోడ్డుపైకి వచ్చేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





విద్యుద్దీపాల వెలుగులో..



కుటుంబ సమేతంగా విచ్చేసి..





వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు



దర్గా బయటకు వచ్చిన క్యూలైన్